ఇంటికి ఆసరాగా నిలిచేది కూతురే..

● జిల్లా పీడబ్ల్యూడీ సంక్షేమ అధికారి బావయ్య

తల్లులను సన్మానిస్తున్న బావయ్య, వైద్య సిబ్బంది

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 20 : కూతురు ఆ ఇంటి భవిష్యత్తుకు ఆసరాగా నిలుస్తుందని జిల్లా పీడబ్ల్యూడీ సంక్షేమ అధికారి బావయ్య అన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాన్సువాడ మాతా-శిశు దవాఖానలో జిల్లా మహిళా సాధికారక కేంద్రం, బాన్సువాడ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆడ పిల్లలను కన్న తల్లులకు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా బాన్సువాడ మాతా-శిశు దవాఖాన ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధా మాట్లాడుతూ.. ఆడ పిల్లలకు పట్టుదల ఎక్కువగా ఉంటుందని, వారిని సరైన పద్ధతిలో మార్గనిర్దేశం చేస్తే ఏదైనా సాధించే సత్తా ఉంటుందని తెలిపారు. కూతురును కూడా కొడుకులా పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని అన్నారు. కార్యక్రమంలో సీడీపీవో కళావతి, సఖీ కేంద్రం ఇన్‌చార్జి సాయవ్వ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్య, షహనాజ్, దవాఖాన నర్సింగ్ సిబ్బంది ఆరోగ్యజ్యోతి, మల్లీశ్వరీ, అమృత, శైలజా, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది అశోక్, భరత్, జిల్లా సాధికారక కేంద్రం సిబ్బంది శారద, తులసి, సౌందర్య, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల భూములను కాపాడాలి

ప్రిన్సిపాల్ విజయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

కామారెడ్డి, డిసెంబర్ 20 : ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూములను ప్రైవేట్ వ్యక్తుల నుంచి కాపాడాలని విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళాశాల భూములను కబ్జా చేయడానికి ప్రైవేట్ వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. శిశు మందిర్ యాజమాన్యం 2018 ఫిబ్రవరిలో రెండు ఎకరాల తప్పుడు లీజు రిజిస్ట్రేషన్ చేయించుకొని భూకబ్జాలకు పాల్పడుతుందని ఆరోపించారు. శిశు మందిర్ పాఠశాలను వెంటనే స్వాధీనం చేసుకొని, కర్షక్ బీఈడీ కళాశాలను ప్రభుత్వ ఆధీనంలో నడిపించాలని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఆజాద్, ఐరేని సందీప్, ముదాం అరుణ్, విఠల్, కుంబాల లక్ష్మణ్, నీల నాగరాజు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ చేపట్టాలి

● కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, డిసెంబర్ 20 : ఓటర్ల జాబితా సవరణ చేపట్టాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. బుధవారం కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల తహసీల్దార్లతో మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలాల వారీగా మృతి చెందిన ఓటర్లు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒక వ్యక్తి పేరు రెండు చోట్ల ఉన్నవారి వివరాలు సేకరించి, వారికి నోటీసులు అందజేసి ఒక చోటే జాబితాలో పేరు ఉండేలా చూడాలని తెలిపారు. జనవరి ఒకటి 2024 నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. మృతి చెందిన వారి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించాలని చెప్పారు. ఓటు హక్కు కలిగి ఉండి ఇతర ప్రాంతాలకు వెళ్తే వారికి నోటీసులు ఇచ్చి తొలగించాలని సూచించారు. ధరణిలో పెండింగ్ ఫైళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే వాటిని పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మనుచౌదరి, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, ఏవో మసూర్ అహ్మద్, ఎన్నికల విభాగం అధికారులు ప్రేమ్‌కుమార్, అనిల్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతి ఘటనలో
హెచ్ఎం సస్పెన్షన్

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 20 : బాన్సువాడ మండలం కొత్తాబాది ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుప్యా రాథోడ్‌ను జిల్లా విద్యాధికారి రాజు సస్పెండ్ చేసినట్లు మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు బుధవారం తెలిపారు. పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థి ఎండీ ఫర్హాన్ మంగళవారం పాఠశాల వెనుక ఉన్న నిజాంసాగర్ ఉప కాలువలో పడి మృతి చెందాడు. ఈ ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు. విధుల్లో ఉండాల్సిన ప్రధానోపాధ్యాయుడు రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లిపోయినట్లు అధికారుల విచారణలో తేలింది. విద్యార్థి మృతితో విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు ఆందోళన, రాస్తారోకో చేపట్టారు. ప్రాథమిక విచారణ అనంతరం హెచ్ఎంను సస్పెండ్ చేశారు.

నర్సరీ పనుల పరిశీలన

బీబీపేట్, డిసెంబర్ 20: మండలంలోని శివారు రాంరెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని ఎంపీవో కృష్ణ బుధవారం పరిశీలించారు. నర్సరీ పనుల్లో నిరక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నర్సరీలో బ్యాగ్ ఫిల్లింగ్ పనులను పూర్తి చేసి ప్రజలకు అవసరమయ్యే సీడ్స్ నాటాలని పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామికి సూచించారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ధర్నా

గ్రామ పంచాయతీలో కార్యదర్శిని నిలదీస్తున్న గ్రామస్తులు

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 20 : కొత్తాబాది గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి అక్రమాలకు పాల్పడుతున్నాడని, ఇంటి పర్మిషన్లు, ధ్రువీకరణ పత్రాల జారీలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అక్రమాలకు పాల్పడుతున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. ఇండ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కోసం కొందరి వద్ద నుంచి డబ్బులు తీసుకొని ఓనర్ సర్టిఫికెట్లు జారీ చేశారని, తమకు కూడా ఓనర్ సర్టిఫికెట్లు జారీ చేయాలంటూ కొందరు గ్రామస్తులు కార్యదర్శిని నిలదీశారు. అక్రమాల విషయమై గతంలోనే ఎంపీడీవోకు ఫిర్యాదు చేశామని, అయినా పట్టించుకోలేదని వారు ఆరోపించారు. ఎంపీడీవో వచ్చే వరకు గ్రామ పంచాయతీ నుంచి వెళ్లేది లేదంటూ భీష్మించి కూర్చున్నారు. తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని, ఎవరి నుంచి డబ్బులు తీసుకోలేదని కార్యదర్శి నవీన్ పేర్కొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

మాచారెడ్డి, డిసెంబర్ 20 : మండలంలోని అక్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న మాన్‌సింగ్ బదిలీపై చుక్కాపూర్ పాఠశాలకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేసి వీడ్కోలు పలికారు.
ఆయన పాఠశాలకు చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు బట్టు రమేశ్, గడ్డం బాబు, పొన్నాల వెంకటిరెడ్డి, రాజలింగం, రాజ్‌కుమార్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధన కోసం కృషి చేయండి

బాన్సువాడ, డిసెంబర్ 20 : ఆర్థిక సంవత్సరం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఆర్వీలు లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి ఆర్వీలకు సూచించారు. బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన ఆర్వీలతో సమీక్షించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో లబ్ధిదారులకు అందజేసే రుణాలు, టార్గెట్ అచీవ్‌మెంట్, ఆర్వీలు సాధించిన ప్రగతిని తెలుసుకున్నారు. మిగిలిన లక్ష్యాన్ని ఈ నెల చివరికల్లా వందశాతం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేశ్, స్త్రీనిధి ఆర్ఎం మహేందర్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్, ఆర్వీలు ఉన్నారు.

జాతీయస్థాయి
వాలీబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

కామారెడ్డి, డిసెంబర్ 20 : జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు కామారెడ్డిలోని సాందీపని డిగ్రీ కళాశాల విద్యార్థి ఉదయ్‌కిరణ్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబు, అకడమిక్ కోఆర్డినేటర్ మనోజ్‌కుమార్ శాలువా, మెమొంటోతో సత్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహించిన యూనివర్సిటీ వాలీబాల్ సెలక్షన్‌లో ఉదయ్‌కిరణ్ ఎంపికయ్యాడని తెలిపారు. కర్ణాటకలోని మంగళూరు యూనివర్సిటీలో నిర్వహించే జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి జైలు శిక్ష

భిక్కనూర్ డిసెంబర్ 20 : మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్ష, జరిమానా విధించినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరుకు చెందిన చేపూరి బలరాం, తిప్పాపూర్‌కు చెందిన నాగర్తి మల్లేశ్‌రెడ్డి మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. ఇద్దరికీ రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించినట్లు చెప్పారు. మద్యంతాగి వాహనం నడిపితే చర్యలు తప్పవన్నారు. ఎప్పటికప్పుడు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని ఎస్సై తెలిపారు.

మాలధారులకు అల్పాహారం అందించిన ముస్లిం యువకుడు

రాజంపేట్, డిసెంబర్ 20 : మండల కేంద్రంలో పలువురు అయ్యప్ప మాలధారులకు అల్పాహారాన్ని అందించి మతసామరస్యాన్ని చాటాడు ఓ ముస్లిం యువకుడు. రాజంపేటలోని 26 మంది అయ్యప్ప మాలధారులు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సన్నిదానం ఏర్పాటు చేసుకున్నారు. గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు ముంతాజ్ అలీ మాలధారులకు బుధవారం భిక్ష, అల్పాహారం అందించాడు. ముంతాజ్ అలీని గ్రామస్తులు అభినందించారు.

క్యాసంపల్లిలో శ్రమదాన్ దివస్

కామారెడ్డి రూరల్, డిసెంబర్ 20 : కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పైడిలైట్ కంపెనీ ఆధ్వర్యంలో కామారెడ్డి ఫెవికాల్ చాంపియన్ క్లబ్ కాంట్రాక్టర్స్ సహకారంతో శ్రమదాన్ దివస్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పాఠశాలలోని పాత టేబుల్స్, కుర్చీలు, డోర్స్ దాదాపు రూ.20 వేల విలువైన సామగ్రిని బాగు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీత, అఖిల్, అర్జున్, సదాశివుడు, మహేశ్, ప్రకాశ్, నర్సింహారావు, సురేందర్, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్, ఎంపీటీసీ, ఉపసర్పంచ్, ఫెవికాల్ చాంపియన్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కొనలను తుంచి నాటు వేయాలి

అవగాహన కల్పిస్తున్న ఏఈవో రాజాగౌడ్

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 20: నారు కొనలను తుంచి నాటువేయాలని వ్యవసాయ విస్తీర్ణాధికారి రాజాగౌడ్ రైతులకు సూచించారు. మండలంలోని రత్నాపూర్, తిమ్మారెడ్డితండాల్లో వరి నారుమడులను ఆయన బుధవారం పరిశీలించారు. నారుమడి నుంచి నారు తీయడానికి ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కొనలను తుంచి నాటు వేయడంతో ఆకు కొన చివర కాండం తొలిచే పురుగు, ఆకు ముడత రెక్కల పురుగులు గుడ్లు పెట్టే అవకాశం ఉండదని తెలిపారు. పురుగుల ఉధృతిని కూడా తగ్గించవచ్చన్నారు. నాటు వేసే సమయంలో ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్ల చొప్పున కాలిబాటలు వదలాలని రైతులకు సూచించారు.

దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ

దివ్యాంగుడితో వ్యాయామం చేయిస్తున్న డాక్టర్ విశాలాక్షి

ఎల్లారెడ్డి/ పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 20: ఎల్లారెడ్డిలోని భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు డాక్టర్ అరుణ్ ఫిజియోథెరపీ నిర్వహించారు. ప్రతి రోజూ వారితో ఇంటి వద్ద చేయించాల్సిన వ్యాయామాలను చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. పెద్దకొడప్‌గల్‌లోని భవిత సెంటర్‌లో దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. డాక్టర్ విశాలాక్షి దివ్యాంగ చిన్నారులతో వ్యాయామం చేయించారు. శారీరక వైకల్యం ఉన్న చిన్నారులతో నిత్యం వ్యాయామం చేయిస్తే వారి వైకల్యం తగ్గుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం విఠల్, ఉపాధ్యాయులు బలరాం, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో సాయన్న

గాంధారి, డిసెంబర్ 20: ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని డీఆర్డీవో సాయన్న అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేసే కూలీల సంఖ్యను పెంచేలా చూడాలన్నారు. ఉపాధి పనులు చేసిన కూలీలకు డబ్బులు వెంటనే వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు పెంచడానికి బ్యాగ్ ఫిల్లింగ్ పనులను చేపట్టాలన్నారు. నాణ్యమైన విత్తనాలను నాటాలని సూచించారు. ఉపాధి పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో సతీశ్‌కుమార్, ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్డీవో సాయన్న

ప్రతి రోజూ పనులు చేపట్టాలి..

రామారెడ్డి, డిసెంబర్ 20: ఉపాధి హామీ పనులు ప్రతిరోజూ చేపట్టాలని, కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో సవితా రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 50శాతానికి తగ్గకుండా కూలీలు పనులకు హాజరయ్యేలా చూడాలన్నారు. గ్రామాల్లో ఇంటి పన్ను వసూలు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీవో ధర్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు క్రాంతికుమార్, అరవింద్ రెడ్డి, లావణ్య, సాగర్‌గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్లు బలరాం, పరశురాం, రజిత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మంచి వాతావరణం కల్పించాలి

విద్యార్థినులతో మాట్లాడుతున్న అధికారిణి ఉమారాణి

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 20: పాఠశాలలో విద్యార్థులకు మంచి వాతావరణం కల్పించాలని సెక్టోరియల్ అధికారిణి ఉమారాణి అన్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు తగిన వసతులు కల్పించాలని పాఠశాల ప్రత్యేకాధికారిణి సుశీలకు సూచించారు. ఎల్లారెడ్డిలోని కేజీబీవీని ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆమె విద్యార్థినులతో మాట్లాడారు. పాఠ్యాంశాల బోధనను అడిగి తెలుసుకున్నారు. యూ డైస్ ప్లేస్, ఉన్నతి ప్రోగ్రామ్స్, ఎఫ్ఎల్ఎన్ ఏ విధంగా కొనసాగుతున్నాయనే వివరాలపై ఆరా తీశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయురాళ్లు, విలీన విద్య ఉపాధ్యాయుడు వెంకటేశం, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ అశోక్ తదితరులు ఉన్నారు.

సంత్ గాడ్గే బాబాకు నివాళి

గాడ్గే ఫొటో వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

బిచ్కుంద, డిసెంబర్ 20: బిచ్కుందలో సంత్ గాడ్గే వర్ధంతిని రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాడ్గే ఫొటోకు పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ జడ్పీటీసీ కమల్‌కిశోర్ మాట్లాడుతూ.. గాడ్గే బాబా సామాజిక న్యాయం కోసం పరితపించే వాడని అన్నారు. మంచి వాగ్గేయకారుడని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సురేశ్, వార్డు సభ్యులు బస్వరాజ్, పత్తి లింగూరాం, నాయకుడు హజీ బాల్‌రాజ్, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన
జడ్పీ మాజీ చైర్మన్

ఎస్పీ సింధూశర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ రాజు

నిజాంసాగర్, డిసెంబర్ 20: కామారెడ్డి ఎస్పీ సింధూశర్మను ఆమె కార్యాలయంలో జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దుర్గారెడ్డి ఉన్నారు.

బడీడు బాలుడి గుర్తింపు

నిజాంసాగర్, డిసెంబర్ 20: మండలంలోని బంజపల్లి గ్రామంలో బుధవారం విద్యాశాఖ అధికారులు బడిబయటి పిల్లల సర్వే నిర్వహించారు. ఒడ్డెర కాలనీలో శశివర్ధన్ అనే బాలుడు ఇంటి వద్దనే ఉంటున్నట్లు గుర్తించారు. అతడి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి బాలుడిని పాఠశాలకు పంపించేలా ఒప్పించారు. సీఆర్పీలు నర్సింహులు, శ్రీధర్, ఐఈఆర్టీ సాయిలు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై
శ్రద్ధ చూపాలి

పిట్లం, డిసెంబర్ 20: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యం విషయంలో కార్యకర్తలు శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక అన్నారు. ఆమె బుధవారం మండలకేంద్రంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. చిన్నారులకు పంపిణీ చేస్తున్న పోషకాహారాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు తప్పకుండా పోషకాహారం అందించాలని కార్యకర్తలకు సూచించారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు

పిట్లం, డిసెంబర్ 20: మండలకేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, భిక్ష ఏర్పాటు చేశారు. పిట్లం గ్రామానికి చెందిన జొన్న మోహన్‌రెడ్డి సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోలీసులకు సహకరించాలి

ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు

సదాశివనగర్, డిసెంబర్ 20: కొత్త సంవత్సరం వేడుకలు ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని, పోలీసులకు సహకరించాలని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. డీజే సిస్టం, పటాకులు కాల్చడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధమని తెలిపారు. రోడ్లపై కేక్ కట్ చేయొద్దని సూచించారు. ఇతరులకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గాలీపూర్ స్కూల్‌లో ఆయుష్ వైద్య శిబిరం

నిజాంసాగర్, డిసెంబర్20: మహ్మద్‌నగర్ మండలంలోని గాలీపూర్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయుష్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ రత్నం విద్యార్థులకు ఆయుష్ సేవలను వివరించారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. హెచ్ఎం అమర్‌సింగ్, సిబ్బంది సునీత, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడాలి

సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జానకి

గాంధారి, డిసెంబర్ 20: ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలని తహసీల్దార్ జానకి బీఎల్వోలకు సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన బూత్ లెవల్ అధికారులతో(బీఎల్వోలు) బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, 18 ఏండ్లు నిండిన యువత తప్పకుండా ఓటు కోసం నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఓటరు జాబితా నుంచి చనిపోయిన వారి పేర్లు తొలగించాలని సూచించారు. వివాహం జరిగి ఇతర గ్రామాలకు వెళ్లిన వారి పేర్లను కూడా జాబితా నుంచి తొలగించాలన్నారు. జాబితాలో సవరణలకు కూడా అవకాశం ఉన్నదని తెలిపారు. నాయబ్ తహసీల్దార్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED
★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024, 9640400073.
NT-314374

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.